క్లుప్తంగా

ఘనంగా ఫ్రెషర్స్ డే



మాట్లాడుతున్న కళాశాల ప్రిన్సిపాల్ భరత్‌కుమార్ నాయక్

అరకులోయ రూరల్: మండల కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్ భరత్‌కుమార్ నాయక్ ఆధ్వర్యంలో శుక్రవారం ఘనంగా ఫ్రెషర్స్ డే వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కళాశాలలో సీనియర్, జూనియర్ విద్యార్థుల మధ్య తారతమ్య లేకుండా సోదరభావంతో ఐక్యంగా ఉండాలని, క్రమశిక్షణతో మెలగాలన్నారు. బాగా చదువుకొని ఉన్నతులుగా ఎదగాలని ఆకాంక్షించారు. స్థానిక మహిళ కళాశాల ప్రిన్సిపాల్ చలపతిరావు, దండకారణ్య కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనుబాబు, వ్యాపారవేత్త మయూరి రాజు తదితరులు పాల్గొన్నారు.

అగ్నిప్రమాద బాధితులకు సాయం



బాధిత కుటుంబానికి సాయమందిస్తున్న తహసీల్దార్ వేణుగోపాల్

వై.రామవరం: మండలంలోని యార్లగడ్డ గ్రామంలో గురువారం సాయంత్రం జరిగిన అగ్ని ప్రమాదంలో అల్లంకుల మల్లయ్యకు చెందిన పూరిల్లు పూర్తిగా దగ్ధమై సుమారు రూ.1.50లక్షల ఆస్తి నష్టం వాటిల్లిన విషయం విదితమే. ఈ మేరకు తహసీల్దార్ పి.వేణుగోపాల్ శుక్రవారం సంఘటన స్థలాన్ని సందర్శించి, బాధిత కుటుంబానికి బియ్యం, పప్పులు, తదితర నిత్యావసర వస్తువులను సాయంగా అందజేశారు. ఎంపీటీసీ సభ్యురాలు వీరమళ్ల సుబ్బలక్ష్మి, సర్పంచ్ పల్లాల పద్మావతి, గ్రామ పెద్దలు పల్లాల వెంకట రమణారెడ్డి, కరణం కనకరాజు తదితరులు పాల్గొన్నారు.

గంజాయి అనర్థాలపై కళాజాత



గెమ్మెలిలో కళాజాత నిర్వహిస్తున్న కళాకారులు

జి.మాడుగుల: మండలంలోని గెమ్మెలి, వంజరి, కొత్రపాడు తదితర గ్రామాల్లో పోలీసు శాఖ సౌజన్యంతో ఎస్ఐ షణ్ముఖరావు ఆధ్వర్యంలో గంజాయి అనర్థాలపై శుక్రవారం కళాజాత కార్యక్రమం నిర్వహించారు. గంజాయి, డ్రగ్స్ వల్ల కలిగే అనర్థాలను, గంజాయి కేసుల్లో పట్టుబడితే కలిగే నష్టాలను బుర్రకథ రూపంలో కళాకారులు వివరించారు. గంజాయి సాగు, రవాణా చట్ట రీత్యా నేరమన్నారు. పసుపు, కాఫీ, మిరియాలు, కొర్రలు, సామలు తదితర వాణిజ్య పంటల సాగుపై రైతులు దృష్టి సారించాలని వివరిస్తూ కళాకారులు నాటిక ప్రదర్శన ద్వారా అవగాహన కల్పించారు.

విద్యా సామర్థ్యాలపై శ్రద్ధ



సదురమామిడిలో పాఠశాలను తనిఖీ చేస్తున్న వెల్ఫేర్ అసిస్టెంట్ రత్నాలమ్మ

జి.మాడుగుల: మండలంలో బొయితిలి పంచాయతీ సదురమామిడి గ్రామంలో గల మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలను శుక్రవారం గ్రామ సచివాలయం వేల్ఫేర్ అసిస్టెంట్ రత్నాలమ్మ తనిఖీ నిర్వహించారు. పాఠశాలలో బోధన, మధ్యాహ్న భోజనం అమలుపై ఆమె విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు విద్యా సామర్థ్యాల పట్ల ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఆమె సూచించారు.

26న వైద్య శిబిరం

సీలేరు: ఏపీ జెన్‌కో కల్యాణమండపంలో ఈనెల 26న మెగా వైద్య శిబిరం నిర్వహించనున్నట్టు నిర్వాహకులు తెలిపారు. శిబిరంలో వైద్య నిపుణులు సేవలందిస్తారని పేర్కొన్నారు. వివిధ రకాల పరీక్షలను నామమాత్రపు రుసుముతో చేయనున్నట్టు తెలిపారు. శిబిరానికి దూర ప్రాంతాల నుంచి వచ్చే రోగులకు నక్కా జ్ఞానేశ్వరరావు ఉచిత భోజన సదుపాయాన్ని కల్పిస్తారని పేర్కొన్నారు.

సమస్యల చెంత.. వారపు సంత



గుంటసీమలో వారపు సంతలో ఏర్పాటుచేసిన దుకాణాలు

- కనీస సౌకర్యాలు కరువు
- సంత షెడ్లు, గిడ్డంగులు లేక రైతుల అవస్థలు
- వినియోగదారుల ఇక్కట్లు
- పట్టించుకోని అధికారులు

డుంబ్రిగుడ: మండలంలోని ఆంధ్రా–ఒడిశా సరిహద్దు ప్రాంతం గుంటసీమలో ప్రతి మంగళవారం నిర్వహించే వారపు సంతలో సమస్యలు తిష్ట వేశాయి. ఈ సంతలో పాడేరు, మాడుగుల, ధర్మవరం, పాడువా, కొత్రాపుట్టు, పెద్దబయలు, ముంచంగిపుట్టు తదితర ప్రాంతాల నుంచి వ్యాపారులు వచ్చి గిరిజనులు తీసుకొచ్చిన వ్యవసాయ, అటవీ ఉత్పత్తులను కొనుగోలు చేస్తారు. అలాగే మైదాన ప్రాంత వ్యాపారులు దుస్తులు, గృహ సామగ్రి, తినుబండారాల్లు, వంటనూనె తదితర వస్తువులు విక్రయిస్తారు. అయితే ఈ సంతను గత సంవత్సరంలో పునఃప్రారంభించారు. గతంలో ఇక్కడ పెద్ద సంత జరిగేది. ఇక్కడ వ్యాపార లావాదేవీలు అధికంగా జరిగేవి. 2009లో భారీ తుపాను కారణంగా లివిటిపుట్టు వద్ద వంతెన వరదకు కొట్టుకుపోయింది. దీంతో చాలా గ్రామాల నుంచి ఈ ప్రాంతానికి రాకపోకలు నిలిచిపోయాయి. ఈ నేపథ్యంలో కించుమండలో బుధవారం, అరకులో శుక్రవారం జరిగే సంతలకు ఎక్కువగా వ్యాపారాలు జరగడం ప్రారంభమయ్యాయి. వంతెన లేని కారణంగా గుంటసీమలో సంతకు ప్రాధాన్యం తగ్గిపోయింది. అయితే గత ఏడాది గుంటసీమ, రంగిలిసింగి, గుంటగన్నేల, తూటంగి, లైగండ, అరమ, పోతంగి, కంద్రుమ్ 8 పంచాయతీలకు చెందిన సుమారు 120 గిరిజన గ్రామాల్లోని గిరిజనులకు నిత్యవసరాలతో పాటు తమ పండించే పంటలు, అటవీధినుస్సులు విక్రయించే వీలుగా పంచాయతీల సర్పంచ్‌ల చొరవతో అప్పటి అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ, ఎమ్మెల్సీ కుంభా రవిబాబులు ఆయా వ్యాపారస్తులతో, అధికారులతో మాట్లాడి సంత ఏర్పాటుకు సన్నాహాలు చేశారు. దీంతో 2023లో సంత ప్రారంభమైంది.



సంత షెడ్లు లేక రోడ్డుపై ఏర్పాటు చేసుకున్న తాత్కాలిక దుకాణాలు

సమస్యలివీ...

గుంటసీమలో సంత జరిగే ప్రదేశంలో సంత షెడ్లు లేకపోవడం, పరిసర ప్రాంతంలో దాహార్తి తీర్చుకునేందుకు బోరింగు లేక సంతకు వచ్చే గిరిజనులకు అవస్థలు తప్పడం లేదు. సంతకు తీసుకొచ్చిన సరకులను భద్రపరచుకునేందుకు గిడ్డంగులు లేవని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సమస్యలతో సతమతమవుతున్నామని చెబుతున్నారు. తాగునీటి కోసం ఇబ్బందులు తప్పడం లేదని గ్రామస్తులు చెబుతున్నారు. సంతలో సమస్యలపై పలుమార్లు అధికారులకు విన్నవించినా పట్టించుకోవడం లేదంటున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి సమస్యలు పరిష్కరించాలని వారు కోరుతున్నారు.



సంతలో గిడ్డంగుల నిర్మాణానికి అనువైన స్థలం ఇదే

సరకుల భద్రతకు ఇబ్బంది



ప్రతి మంగళవారం గుంటసీమలో జరుగుతున్న వారపుసంతలో వ్యాపారులు వచ్చి వ్యవసాయ, అటవీ ఉత్పత్తులను కొనుగోలు చేస్తుంటారు. వర్షాలు కురిసినపుడు సరకుల భద్రత రైతులకు ఇబ్బందిగా మారింది. సంతలో షెడ్లు లేవు..గిడ్డంగులు లేక రైతులు చాలా ఇబ్బందులు పడుతున్నాం. అధికారులు స్పందించి షెడ్లు, గిడ్డంగులు ఏర్పాటుచేయాలి.
– బురిడి రామరావు, ఎంపీటీసీ తూటంగి, లైగండ పంచాయతీ, డుంబ్రిగుడ

తాగునీటి సౌకర్యం కల్పించాలి



గుంటసీమ సంతలో సంతకు వచ్చే గిరిజనులకు తాగునీరు సౌకర్యం కల్పించాలి. సంత పరిసర ప్రాంతంలో ఒక్క బోరు ఏర్పాటు చేయాలి. సంతకు వచ్చే వారు దాహార్తి తీర్చుకునేందుకు బోరు ఉండడంతో తాగునీటి సమస్య ఉండదు.
–కిల్లో దాలిమ్మ, గుంటసీమ గ్రామం, డుంబ్రిగుడ మండలం

ప్రతిపాదనలు పంపాం



సంతలో నెలకొన్న సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం. ఇందులో భాగంగా మండల పరిషత్‌లో నిధులు మంజూరైతే గుంటసీమ సంతలో బోరుఏర్పాటుకు చర్యలు తీసుకుంటాం. సంతలో గిడ్డంగులు, షెడ్ల ఏర్పాటుపై ప్రతిపాదనలు పంపాం. – ప్రేమ్‌సాగర్, ఎంపీడీవో, డుంబ్రిగుడ

రోడ్డు పనులు ప్రారంభం



రోడ్డు పనులను ప్రారంభిస్తున్న సర్పంచ్ నాగులమ్మ

గూడెంకొత్తవీధి: మండలంలోని సంకాడ పంచాయతీ గోవాడలో సీసీరోడ్డు పనులను సర్పంచ్ నాగులమ్మ శుక్రవారం ప్రారంభించారు. జెడ్పీటీసీ నిధులు రూ.2లక్షలతో రోడ్డు నిర్మాణ పనులు చేపడుతున్నట్టు తెలిపారు. వైస్ ఎంపీపీ లోతా దేముడు తదితరులు పాల్గొన్నారు.

64 మందికి వైద్య పరీక్షలు



మారేడుబాకలో రోగులను పరీక్షిస్తున్న డాక్టర్ నాగార్జున

రాజవొమ్మంగి: మండలంలోని మారేడుబాకలో శుక్రవారం నిర్వహించిన ఫ్యామిలీ డాక్టర్ శిబిరంలో 64 మంది రోగులను పరీక్షించి చికిత్స అందజేసినట్టు జడ్డంగి పీహెచ్‌సీ డాక్టర్ నాగార్జున తెలిపారు. పరీక్షలు చేసి బీపీ, సుగర్ సమస్యలున్న వారిని గుర్తించి, వారికి అవసరమైన మందులు ఉచితంగా ఇచ్చామన్నారు. గర్భిణులు, బాలింతలకు ఆరోగ్యభద్రతపై సూచనలు ఇచ్చామన్నారు. హెచ్‌వీ చిన్నయమ్మ, ఎంఎల్‌హెచ్‌పీ సరస్వతి, ఆశ, ఏఎన్‌ఎంలు నూకరత్నం, రాజులమ్మ 104 డీఈఓ శ్రీనివాస్, పైలట్ కనకరాజు పాల్గొన్నారు.

రహదారుల నిర్మాణానికి అటవీశాఖ అభ్యంతరాలపై కలెక్టర్‌కు ఫిర్యాదు



కలెక్టర్ దినేష్‌కుమార్‌కు వినతిపత్రం ఇస్తున్న గ్రామస్తులు

కొయ్యూరు: బూదరాళ్ల పంచాయతీలో మంజూరైన 11 రోడ్లకు అటవీశాఖ అభ్యంతరాలపై కలెక్టర్ దినేష్‌కుమార్‌కు ఫిర్యాదు చేసినట్టు బూదరాళ్ల సర్పంచ్ సాగిన ముత్యాలమ్మ, వార్డు సభ్యులు సంజీవ్ శుక్రవారం విలేకరులకు తెలిపారు. అటవీశాఖ అభ్యంతరం వల్ల రహదారి లేక స్థానికులు ఇబ్బందులు పడుతున్నారని, ఈ విషయాన్ని కలెక్టర్‌కు వివరించినట్టు చెప్పారు. దీనిపై స్పందించిన కలెక్టర్ వెంటనే పనులు ప్రారంభించాలని ఆదేశాలు ఇచ్చారన్నారు. పిట్టలపాడు, కునుకూరు గ్రామాల్లో రహదారులు, వంతెనలు, గరిమండ, బాలరేవులకు ఆరోగ్య ఉప కేంద్రాలకు భవనాల నిర్మించాలని కోరామన్నారు.

లక్ష్యంతో చదివితే ఉత్తమ ఫలితాలు



విద్యార్థులకు సూచనలిస్తున్న ఎంపీడీవో రామకృష్ణ

గంగవరం: మండలంలోని మోహనాపురం గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలను ఎంపీడీవో రామకృష్ణ శుక్రవారం సందర్శించారు. విద్యార్థుల విద్యా సామర్థ్యాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణ, లక్ష్యంతో చదివితే ఉత్తమ ఫలితాలు పొందవచ్చన్నారు. మెనూ ప్రకారంగా విద్యార్థులకు నాణ్యమైన భోజనాన్ని అందజేయాలని ఉపాధ్యాయులను ఆదేశించారు. హెచ్‌ఎం బాలరాజు తదితరులున్నారు. అనంతరం గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించారు. గ్రామంలో పంచాయతీ సర్వేను పరిశీలించారు. ఆయన వెంట నీతి అయోగ్ ఎబిఎస్ హేమమాధురి, రమణ, తదితరులున్నారు.

ప్రజా సమస్యలపై ప్రత్యేక దృష్టి



మాట్లాడుతున్న ఎంపీపీ వరహాలమ్మ

పెదబయలు: మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ బొండా వరహాలమ్మ అధ్యక్షతన శుక్రవారం సర్వసభ్య సమావేశం జరిగింది. సమావేశంలో గ్రామాల్లో నెలకొన్న పలు సమస్యలను సభ దృష్టికి తీసుకొచ్చారు. ఇందులో భాగంగా జల్‌జీవన్ మిషన్ ద్వారా చేపడుతున్న పనులు పూర్తికాకపోవడంతో గ్రామాల్లో తాగునీటి సమస్య వేధిస్తోందని ప్రజాప్రతినిధులు ధ్వజమెత్తారు. అధికారులు స్పందించి పనులు వేగవంతం చేయాలన్నారు. బొంగరం పంచాయతీ కుంబుర్ల, లింగేటి పంచాయతీ వనకొత్తూరు పాఠశాలల్లో ఉపాధ్యాయుల గైర్హాజరు, మధ్యాహ్న భోజనం పథకం సమస్యను ఎంపీటీసీ సభ్యుడు మత్స్యకొండబాబు ప్రస్తావించారు. అధికారులు సమస్య పరిష్కరించాలని కోరారు. ఈ సందర్భంగా ఎంపీపీ వరహాలమ్మ మాట్లాడుతూ గ్రామాల్లో ప్రజా సమస్యల పరిష్కారంపై అధికారులు దృష్టి సారించాలన్నారు. మండలంలో పలు అభివృద్ధి పనులపై సభ్యులు తీర్మానం చేశారు. జెడ్పీటీసీ సభ్యుడు కూడ బొంజుబాబు, ఎంపీడీవో పూర్ణయ్య, తహసీల్దార్ రంగారావు, వైస్ ఎంపీపీ సోనే రాజుబాబు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

సీపీఐ, సీఐటీయూ నేతల ఆందోళన

చింతూరు: బిల్లులు చెల్లించేందుకు అంగన్‌వాడీ వర్కర్ల నుంచి సొమ్ములు వసూలు చేస్తున్న సూపర్‌వైజర్‌పై తగిన చర్యలు తీసుకోవాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి పల్లపు వెంకట్ డిమాండ్ చేశారు. శుక్రవారం చింతూరులో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ కేంద్రాల్లో ఆహారం పెట్టేందుకు అవసరమైన కూరగాయలు, గ్యాస్‌కు సంబంధించిన బిల్లులు ఇచ్చేందుకు సొమ్ములు ఇవ్వాలని సూపర్‌వైజర్ హుకుం జారీ చేస్తున్నారని, అంగన్‌వాడీ వర్కర్లను వేధిస్తున్నారని ఆరోపించారు. దీనిపై ఉన్నతాధికారులు విచారణ జరిపి సదరు సూపర్‌వైజర్‌పై తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేసారు. లక్ష్మణ్, సుబ్బారావు, జానీ, మనోజ్ పాల్గొన్నారు.

ఎటపాక: పోలవరం నిర్వాసితుల సమస్యలు పరిష్కారమయ్యే వరకు సీపీఎం ప్రజల పక్షాన పోరాడుతుందని పార్టీ మండల కార్యదర్శి ఐవి అన్నారు. మండలంలోని మురుమూరులో నిర్వాసితుల కమిటీ నాయకుడు సుధబాబు వర్ధంతి కార్యక్రమం శుక్రవారం జరిగింది. ఈ కార్యక్రమంలో ఐవీ మాట్లాడుతూ విలీన మండలాల్లో నిర్వాసితుల సమస్యలపై ప్రభుత్వాలు నిర్లక్ష్యం కారణంగా ముంపు ప్రజలకు కష్టాలు తప్పడం లేదని, సమస్యలు సత్వరమే పరిష్కరించాలన్నారు. అర్జున్, రాజా, వీరమ్మ, పెదబాబు, నాగేంద్ర, లక్ష్మణరావు తదితరులున్నారు.

కొయ్యూరు: గ్రామీణా ప్రాంతాల్లో లబ్ధిదారులకు మూడు సెంట్లు, పట్టణ ప్రాంతాల్లో రెండు సెంట్లు భూమిని గృహాలకు కేటాయించాలని డిమాండ్ చేస్తూ సీపీఐ నాయకులు శుక్రవారం ఆందోళన నిర్వహించారు. అనంతరం తహసీల్దార్ ప్రసాద్‌కు వినతిపత్రం అందజేశారు. నాయకుడు సత్యనారాయణ మాట్లాడుతూ ఇంటి నిర్మాణం కోసం ప్రభుత్వం కేటాయించిన స్థలం సరిపోదని, దీనిపై ప్రభుత్వం స్పందించాలని కోరారు నానాజీ, నూకరాజు, కొండలరావు పాల్గొన్నారు.

రాజవొమ్మంగి: రంపచోడవరం సబ్ కలెక్టర్ కార్యాలయం ఈనెల 26వ తేదీన చేపట్టనున్న ఆందోళన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సీఐటీయూ నాయకులు బేబీరాణి, గిరిజన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రామారావు పిలుపునిచ్చారు.

పాలిథిన్ సంచులను వాడొద్దు



వ్యాపారులకు సూచనలిస్తున్న సచివాలయ సిబ్బంది

గూడెంకొత్తవీధి: జిల్లా కలెక్టర్, జేసీ ఆదేశాల మేరకు వారపు సంతల్లో పాలిథిన్ సంచులు డిసెంబరు 1 నుంచి పూర్తిగా నిషేధిస్తున్నట్టు ఎంపీడీఓ ఉమామహేశ్వరరావు తెలిపారు. ఆయన ఆదేశాల మేరకు పెదవలస వారపుసంతలో సచివాలయ ఉద్యోగులు వ్యాపారులను హెచ్చరించారు. సింగిల్ యూజ్ పాలిథిన్ సంచుల వాడకాన్ని పూర్తిగా నిషేధించామన్నారు. ఇకపై సంతలకు వచ్చే వారు సంచులను తెచ్చుకోవాలని సూచించారు.

స్కిల్ డెవలప్‌మెంట్ కేంద్రాలు ఏర్పాటు చేయాలి

చింతూరు: ఆదివాసీ సంక్షేమ పరిషత్ ఆధ్వర్యంలో స్థానిక ఐటీడీఏ వద్ద శుక్రవారం జరిగిన సమావేశంలో పరిషత్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పూనెం చినవీరభద్రం మాట్లాడుతూ ఆదివాసీ యువత ఉపాధి కోసం రాష్ట్రంలోని ఐటీడీఏ పరిధిలో స్కిల్ డెవలప్‌మెంట్ కేంద్రాలను ఏర్పాటు చేయాలన్నారు. ఆదివాసీ యువత నైపుణ్య శిక్షణ లేక ఉపాధి పనులు లేక కూలి పనుల కోసం వలసబాట పడుతున్నారన్నారు. స్థానికంగానే స్కిల్ డెవలప్‌మెంట్ కేంద్రాలు ఏర్పాటుచేసి శిక్షణ అందించి ఆదివాసీ యువతకు ఉపాధి కల్పించాలని కోరారు. ప్రసాద్, లక్ష్మణరావు, శ్రీను, రాఘవయ్య పాల్గొన్నారు.

అనారోగ్యంతో టీచర్ మృతి



మత్స్యరాజు(ఫైల్)

ముంచంగిపుట్టు: మండలంలోని కిలగాడ పంచాయితీ చెరువుపాకల గ్రామంలో ఎంపీయూపీ పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న కొర్రా మత్స్యరాజు(50) అనారోగ్యంతో బాధపడుతూ గురువారం రాత్రి మృతి చెందారు. ఆయన కొద్ది రోజులుగా అనారోగ్యంతో ఉన్నారని, పరిస్థితి విషమించడంతో మృతి చెందినట్టు కుటుంబసభ్యులు తెలిపారు. ఆయన మృతికి ఎంఈవో కె.కృష్ణమూర్తి, ఉపాధ్యాయులు తదితరులు సంతాపం తెలిపారు.

ఓటు హక్కుపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న తహసీల్దార్ శ్రీనివాసరావు

గంగవరం: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు ఓటు హక్కు ప్రాధాన్యత, వినియోగంపై తహసీల్దార్ చిన్నం శ్రీనివాసరావు శుక్రవారం అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ 18 ఏళ్లు నిండిన ప్రతీ ఒక్కరూ ఓటరుగా నమోదు చేసుకోవాలని సూచించారు. ఆర్ఐ లక్ష్మణరావు, ప్రిన్సిపాల్ రామకృష పాల్గొన్నారు.

'హైడ్రో పవర్ ప్రాజెక్టుల ఒప్పందాలను రద్దు చేయాలి'

అరకులోయ రూరల్: చింతపల్లి, అనంతగిరి మండలాల్లో ఎర్రవరం, పెదకోట, చిటంపాడు గుజ్జెలి ప్రాంతాల్లో హైడ్రో పవర్ ప్రాజెక్టుల ఏర్పాటుకు ప్రభుత్వం చేసుకున్న ఒప్పందాలను తక్షణం రద్దు చేయాలని గిరిజన సంఘం రాష్ట్ర కార్యదర్శి కిల్లో సురేంద్రం డిమాండ్ చేశారు. గిరిజన ప్రజలపై కూటమి ప్రభుత్వానికి ఏ మాత్రం శ్రద్ధ ఉన్నా రద్దు చేసి నిరూపించుకోవాలన్నారు. ఎన్నికల్లో హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చేక ముఖం చాటేశారన్నారు. హైడ్రో పవర్ ప్రాజెక్టు ఏర్పాటు చేస్తే 94 గ్రామాలు, 20 వేల ఎకరాల భూములు పోతాయని, 15 వేలమంది ఆదివాసీ ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడతారన్నారు.

సాగునీటి సమస్యపై ఎమ్మెల్యేకు వినతి



ఎమ్మెల్యే విశ్వేశ్వరరాజుకు వినతిపత్రం అందజేస్తున్న సర్పంచ్ దురియా పుష్పలత

చింతపల్లి: చింతపల్లిలో ప్రత్యేక నీటిపారుదల శాఖ డివిజన్ కార్యాలయాన్ని ఏర్పాటు చేయడానికి చర్యలు చేపట్టాలని పాడేరు ఎమ్మెల్యే విశ్వేశ్వరరాజును చింతపల్లి సర్పంచ్ దురియా పుష్పలత కోరారు. పాడేరులో ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఆమె శుక్రవారం ఎమ్మెల్యేను మర్యాదపూర్వకంగా కలిశారు. గతంలో చింతపల్లిలో డివిజన్ కార్యాలయం ఉండడం వలన చింతపల్లి, జీకే వీధి, కొయ్యూరు మండలాల్లో రైతాంగానికి ఈ శాఖ ద్వారా ఎన్నో విధాలుగా ఉపయోగకరంగా ఉండేదన్నారు. ప్రస్తుతం ఈ ప్రాంతంలో ఈ శాఖ సంబంధించి ఎటువంటి కార్యక్రమాలు చేపట్టకపోవడంతో రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వివరించారు.ఈ మేరకు చింతపల్లిలో ప్రత్యేక నీటిపారుదల శాఖ కార్యాలయం పునఃప్రారంభానికి చర్యలు చేపట్టాలని ఎమ్మెల్యేను సర్పంచ్ పుష్పలత కోరారు.

చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే చర్యలు



యువకులకు వాలీబాల్ కిట్‌ను అందజేస్తున్న సీఐ దుర్గాప్రసాద్

చింతూరు: చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడే అసాంఘిక శక్తులకు దూరంగా ఉండాలని, నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తప్పవని చింతూరు సీఐ దుర్గాప్రసాద్ చెప్పారు. మండలంలోని ఆదివాసీ గ్రామమైన వెంకటాపురంలో ఆయన శుక్రవారం పర్యటించి, గ్రామస్తులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ దుర్గా ప్రసాద్ మాట్లాడుతూ గ్రామాల్లో అనుమానాస్పదంగా ఎవరైనా సంచరిస్తుంటే పోలీసులకు సమాచారం ఇవ్వాలని సూచించారు. పిల్లలను బాగా చదివించి ఉన్నతులుగా తీర్చిదిద్దాలన్నారు. పోలీసుశాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత బస్సు సౌకర్యాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా గ్రామంలోని వృద్ధులకు దుప్పట్లు, యువతకు వాలీబాల్ కిట్‌ను ఆయన పంపిణీ చేశారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి



వాహనచోదకులతో మాట్లాడుతున్న ఎస్ఐ పాపినాయుడు

డుంబ్రిగుడ: మండలంలోని అరకు వారపు సంత వద్ద ఎస్ఐ కె.పాపినాయుడు ద్విచక్రవాహనచోదకులు, ఆటో డ్రైవర్లకు శుక్రవారం ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ద్విచక్ర వాహనాదారులు హెల్మెట్‌లను తప్పనిసరిగా ధరించాలని లేని పక్షంలో కేసులు విధిస్తామని హెచ్చరించారు. ఈ ప్రాంతంలో హైవే నిర్మాణం జరుగుతుందని, వాహనాదారులు హైస్పీడ్‌గా డ్రైవింగ్ చేసి ప్రాణాల మీదకు తెచ్చుకోవద్దన్నారు. ప్రమాదాల నివారణకు పోలీసుల సూచనలను పాటించాలన్నారు. ఆటోల్లో పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించవద్దని ఆటో డ్రైవర్‌లకు సూచించారు. ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించాలన్నారు.

పరిసరాల పరిశుభ్రత తప్పనిసరి



భీమవరం సబ్‌స్టేషన్ వద్ద శ్రమదానం చేస్తున్న ఉద్యోగులు



మోహనాపురంలో శ్రమదానం చేస్తున్న ఎంపీడీవో రామకృష్ణ సిబ్బంది

కూనవరం: మండలంలోని భీమవరంలో ఫ్రైడే–డ్రైడే కార్యక్రమంలో భాగంగా ద్యుత్ సబ్‌స్టేషన్ ఏఈ రాజ్‌కపూర్ ఆధ్వర్యంలో విద్యుత్ సబ్‌స్టేషన్ పరిసరాల్లో సిబ్బంది శ్రమదానంతో చెత్తా చెదారాలను తొలగించారు. ఈ సందర్భంగా ఏఈ రాజ్‌కపూర్ మాట్లాడుతూ పరిసరాల పరిశుభ్రత తప్పనిసరిగా పాటించాలన్నారు.

గంగవరం: మండలంలోని మోహనాపురంలో ఫ్రైడే–డ్రైడే కార్యక్రమంలో భాగంగా ఎంపీడీవో పి.జి.రామకృష్ణ ఆధ్వర్యంలో గ్రామ సచివాలయ సిబ్బంది శ్రమదానంతో వీధుల్లో చెత్తా చెదారాలను తొలగించారు. ఎంపీడీవో పి.జి.రామకృష్ణ మాట్లాడుతూ పరిసరాల పరిశుభ్రత పాటించాలన్నారు. జేఈ పద్మనాభం, నితి అయోగ్ ఎబీఎస్ హేమామాధురి తదితరులు పాల్గొన్నారు.

స్పోర్ట్స్ మీట్‌కు 53 మంది విద్యార్థులు



అరకులో స్పోర్ట్స్ మీట్‌కు రాజవొమ్మంగి నుంచి వెళ్తున్న ఏకలవ్య పాఠశాల క్రీడాకారులు

రాజవొమ్మంగి: అరకులో జరుగుతున్న స్టేట్ లెవెల్ ఈఎంఆర్ఎస్ స్పోర్ట్స్ మీట్‌కు రాజవొమ్మంగి ఏకలవ్య పాఠశాల నుంచి 53 మంది విద్యార్థులు వెళ్లినట్టు ప్రిన్సిపాల్ ఎం.వి.కృష్ణారావు తెలిపారు. ఈ పోటీల్లో వారు వాలీబాల్, వెయిట్‌లిఫ్టింగ్, యోగా తదితర ఈవెంట్లలో పాల్గొంటున్నట్లు తెలిపారు. పోటీలు శనివారంతో ముగుస్తాయన్నారు. క్రీడాకారుల వెంట పీఈటీ మేఘా రావత్, కోచ్ మాణిక్యాలరావు, ప్రిన్స్‌పాల్ కృష్ణారావు వెళ్లారు.

పాముకాటుతో గిరిజనుడికి అస్వస్థత



పాముకాటుకు గురై చికిత్స పొందుతున్న అర్జున్‌ను పరామర్శిస్తున్న వైస్ ఎంపీపీ సత్యనారాయణ

ముంచంగిపుట్టు: మండలంలోని కించాయిపుట్టు పంచాయతీ పెద్దపుట్టు గ్రామానికి చెందిన పాంగి అర్జున్ అనే గిరిజనుడు పాముకాటుకు గురై తీవ్ర అస్వస్థతకు గురయ్యాడు. గ్రామ సమీపంలో శుక్రవారం మధ్యాహ్నం వ్యవసాయ పనులు చేస్తుండగా పొదల నుంచి ఆకస్మికంగా పాము వచ్చి అర్జున్ కాలిపై కాటు వేసింది. దీంతో అర్జున్ ఒక్కసారి సొమ్మసిల్లి కింద పడిపోయాడు. దీనిని గమనించిన కుటుంబ సభ్యులతో హుటాహుటిన ముంచంగిపుట్టు సీహెచ్‌సీకి ప్రైవేట్ వాహనంలో తీసుకువచ్చారు. వైద్యాధికారి సంతోష్ బాధితుడికి వైద్య సేవలు అందించారు. సకాలంలో ఆసుపత్రికి తీసుకురావడంతో ప్రాణాపాయం తప్పిందని వైద్యాధికారి చెప్పారు.ఈ విషయం తెలుసుకున్న వైస్ ఎంపీపీ పి.సత్యనారాయణ అర్జున్‌ను పరామర్శించారు. మెరుగైన వైద్య సేవలు అందించాలని వైద్య సిబ్బందికి సూచించారు.